## క్లుప్తంగా

### 4న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**శావల్యాపురం:** స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 4న ఉదయం 10 గంటలకు 1999–2000 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వహణ ప్రతినిధి రెడ్డి కిరణ్ బుధవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 70 మంది కుటుంబ సభ్యులతో ఈకార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. అలాగే తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించే కార్యక్రమం కూడా జరుగుతుందన్నారు. 25 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా సహచర విద్యార్థుల సహకారంతో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

### వీఏఏల బదిలీలు చేపట్టాలి



**నరసరావుపేట రూరల్:** గ్రామ వ్యవసాయ సహాయకుల బదిలీలు చేపట్టాలని గ్రామ వ్యవసాయ సహాయకుల అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. లింగంగుంట్లలోని కార్యాలయంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఐ.మురళీని కలిసి అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. గత ఐదు సంవత్సరాలుగా గ్రామ వ్యవసాయ సహాయకుల బదిలీలు చేపట్టలేదని, త్వరితగతిన బదిలీలు చేపట్టాలని తెలిపారు. నూతనంగా ఏర్పడిన గ్రామీణ క్లస్టర్ కోసం వ్యవసాయ, అనుబంధ సిబ్బందిని హేతబద్ధీకరించాలని కోరారు. 1000–1200 ఎకరాలకు ఒకరిని తప్పని సరిగ్గా నియమించాలన్నారు. దీని వలన రైతులకు సేవా నాణ్యతను మెరుగ్గా అందించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పి.వెంకటరాజు, కార్యదర్శి జి.ఫిలిప్, వీఏఏలు శ్రీకాంత్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### రాజారమేష్‌కు గౌరవ డాక్టరేట్ అవార్డు




**శావల్యాపురం:** ప్రెస్ క్లబ్ వేల్ఫేర్ వరల్డ్‌వైల్డ్ ఫౌండేషన్ న్యూఢిల్లీ వారి సారధ్యంలో విశాఖపట్టణం ద్వారకనగర్ లైబ్రరీ హాల్ నందు జరిగిన కార్యక్రమంలో శావల్యాపురం మండలం తుమ్మలకుంట గ్రామం ఎంపీపీ స్కూలు ప్రధానోపాధ్యాయులు బిళ్లా రాజా రమేష్ గౌరవ డాక్టరేటు పట్టా ను బుధవారం అందుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 సంవత్సరాల నుంచి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ ఎంతోమంది విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దటంతో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు అవార్డు అందుకున్నట్లు తెలిపారు. అవార్డు గ్రహీ తను ఎస్టీయూ సంఘం నేతలు చంద్రజిత్ యాదవ్, కొండ్రముట్ల వెంకటరత్నం, ఎంఈవో మద్దికుంట సాంబశివరావు, పుసులూరి లలితకుమారి, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

### వీల్ చైర్ల పంపిణీ



**చిలకలూరిపేట:** దివ్యాంగులకు రోటరీ సంస్థ అండగా ఉంటుందని రోటరీ జిల్లా గవర్నర్ కాట్రగడ్డ శరత్ చౌదరి చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట, రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం, ఇన్నర్‌వీల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో రోటరీ కమ్యూనిటీ హాలులో బుధవారం ఎనిమిది మంది దివ్యాంగులకు వీల్ చైర్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లిహిల్స్, పిడుగురాళ్ల రోటరీ క్లబ్‌ల సౌజన్యంతో షార్ ప్రాజెక్టు కింద ఈ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ కొమ్మినేని వీర శంకరరావు, సర్వీస్ ప్రాజెక్ట్ చైర్మన్ కేఎస్ఆర్‌కే ప్రసాద్, ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ విష్ణుబాబు, స్థానిక క్లబ్ అధ్యక్షులు ఆళ్ల వేమనరెడ్డి, వారణాసి శరత్‌కుమార్ పాల్గొన్నారు.

### ఘనంగా అక్షయ తృతీయ పూజలు



**వినుకొండ:** పట్టణంలోని కొండమెట్ల వద్ద వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నందు అక్షయ తృతీయ ఉత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి స్వామివారికి చందనోత్సవం నిర్వహించారు. ప్రముఖ న్యాయవాది పోటూరి సైదారావు పాల్గొని గోసంరోణ ఆశ్రమ స్లాబ్ నిర్మాణానికి పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో పి.వి.సురేష్, జీవీ రమణ, జాజుల మాల్యాద్రి, బద్దిక నరసింహారావు, మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# నీటి సరఫరాపై దృష్టి పెట్టండి

- మంచినీటి సరఫరా లోపాలు సవరించండి
- పండరీపురంలోనే నీళ్లు రాలేని స్థితి
- వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు హితవు





మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు

**చిలకలూరిపేట:** నీటి సరఫరా లోపాలపై దృష్టి సారించండి... పండరీపురం వంటి ప్రాంతంలోనే నీటి సరఫరా సక్రమంగా లేదంటే పరిస్థితి ఏ స్థాయిలో దిగజారిందో అర్థం చేసుకోవచ్చు అని మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు హితవు పలికారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మైలవరపు గుండయ్య మున్సిపల్ కౌన్సిల్ హాలులో బుధవారం నిర్వహించారు. సమావేశానికి మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షత వహించారు. ఎజెండా చదవడం పూర్తయ్యాక కౌన్సిలర్లు మాట్లాడుతున్న క్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మంచినీటి సరఫరా మెరుగు పరిచే విషయంలో అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. పలు ప్రాంతాలలో నీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు.

**చెట్లు నరికేస్తుంటే పట్టదా?**

గాంధీ పార్కులో టేకు చెట్టు అక్రమంగా నరికివేసిన విషయం మరువక ముందే విశ్వనాథ సెంటర్‌లో పెద్ద చెట్టును గుర్తు తెలియని వ్యక్తులు నరికివేస్తే ఎందుకు పట్టించుకోవడం లేదని, అసలు పట్టణం పురపాలక సంఘం పరిధిలో ఉందా లేదా అంటూ నిలదీశారు. దీనికి మున్సిపల్ కమిషనర్ పి శ్రీహరిబాబు సమాధానం చెబుతూ పార్కులో నరికివేసిన చెట్టు దుంగలను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. విశ్వనాథ సెంటర్‌లో చెట్టు నరికివేసిన విషయమై పర్యావరణ ఇంజినీర్‌ను విచారించాల్సిందిగా ఆదేశించినట్లు తెలిపారు. దీనికి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అసలు చెట్లను నరికి వేస్తుంటే ఎందుకు కఠిన చర్యలు తీసుకోరు, పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేయడం లేదని ప్రశ్నించారు. దీనికి చైర్మన్ షేక్ రఫాని కల్పించుకొని వచ్చే మున్సిపల్ సమావేశంలోగా విచారణ పూర్తి చేయాలని, అవసరమైతే పోలీసు కేసు పెట్టాలని అధికారులకు సూచించారు.

**వేర్వేరు విషయాలపై...**

పదోవార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి మాట్లాడుతూ పట్టణంలో మంచినీళ్లు మురికిగా వస్తున్నాయి, దీనిపై చర్యలు తీసుకోండి అంటూ కోరారు. ఆక్రమణల తొలగింపు కొన్ని ప్రాంతాలకే పరిమితం చేయకుండా అన్ని ప్రాంతాల్లో నిర్వహించాలని కోరారు. అభివృద్ధి పనులపై శిలాఫలకాలు వేయాలని చెప్పినా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. 34వ వార్డు కౌన్సిలర్ వడితే కోట్యానాయక్ మాట్లాడుతూ గతంలో తడిచెత్త, పొడిచెత్త వేర్వేరుగా సేకరించేందుకు ఆటోలు ఉండేవి, ఇప్పుడు అవి ఎందుకు లేవని ప్రశ్నించారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ చెత్త సేకరించే ఆటోకు నెలకు రూ.62 వేలు చెల్లించాల్సి ఉంటుందని, ప్రభుత్వం మారిన నేపథ్యంలో కాంట్రాక్టు ప్రాతిపదికన ఉన్న ఆటోలను తొలగించి పుష్‌కార్ట్‌లతో చెత్త సేకరిస్తున్నామని చెప్పారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు మాట్లాడారు.

## రేషన్ పంపిణీకి ఆటంకం కలిగిస్తున్నారు!

**పలుకూరు చౌకధరల దుకాణ డీలరు ఆవేదన**

**బొల్లాపల్లి :** రేషన్ పంపిణీకి కూటమి ప్రభుత్వంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆటంకం కలిగిస్తున్నారని మండలంలోని పలుకూరు చౌకధరల దుకాణం 40 డీలర్ పి. నాగసుధ ఆవేదన వ్యక్తం చేశారు. గత 9 ఏళ్లుగా రేషన్ షాపు నడుపుతున్నారని, సరఫరాలో ఎలాంటి లోపాలు లేకుండా ప్రతి కార్డుదారులకు రేషన్ అందజేస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రేషన్ పంపిణీలో అవకతవకలు ఉన్నాయని ఆరోపణలు చేసి అధికారంతో కావాలని ఉద్దేశపూర్వకంగా అధికారులతో రేషన్‌షాపుపై కేసు నమోదు చేయించారని ఆవేదన వెలిబుచ్చారు. అనంతరం కోర్టు ఉత్తర్వుల మేరకు రేషన్ డీలర్‌గా కొనసాగేందుకు ఉత్తర్వులు వెలువడినా స్థానిక టీడీపీ నాయకులు అధికారులను అడ్డం పెట్టుకొని రేషన్ షాపును కొనసాగనివ్వకుండా చేస్తున్నారని వాపోయారు. మే నెలకు చెందిన రేషన్‌ను స్టాక్ పాయింట్ నుంచి గ్రామానికి తరలించి రేషన్ షాపులో దించుతుండగా లారీ డ్రైవర్‌ను, కూలీలను బెదిరించారని, రేషన్ స్టాకును షాపులో దించకుండా గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పలువురు గొడవపడి సరుకును వెనుక్కు పంపించారని తెలిపారు. రేషన్‌షాపు నిర్వహించకుండా రాజీనామా చేయి, నీవు ఎలా పంపిణీ చేస్తావో చూస్తామని బెదిరిస్తున్నారని, ఈ విషయంపై సంబంధిత శాఖల అధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. గతంలో కొన్ని ఏళ్లుగా ఎలాంటి లోపాలు లేకుండా రేషన్‌షాపు నడుపుతున్నానని, షాపు నిర్వహణకు ఆటంకం కలగకుండా సంబంధిత శాఖల అధికారులు దృష్టిసారించాలని రేషన్ డీలర్ ఆవేదన.

## యడ్లపాడులో భోజన–వసతి ఏర్పాట్ల పరిశీలన



యడ్లపాడు గ్రామాన్ని సందర్శించిన ఎస్పీ కంచి శ్రీనివాసరావు, వివిధశాఖల అధికారులు

**యడ్లపాడు:** మండల కేంద్రమైన యడ్లపాడు గ్రామాన్ని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావుతో పాటు పలువురు జిల్లాస్థాయి అధికారులు బుధవారం సందర్శించారు. మే 2న జరిగే అమరావతి సభ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ విచ్చేయనున్న కార్యక్రమానికి తరలివచ్చే ప్రజలకు ఆహారపానీయాల ఏర్పాట్ల నిమిత్తం అధికారులు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మండలంలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. నరసరావుపేట, వినుకొండ, చిలకలూరిపేట ప్రాంతాల నుంచి ఈ సభకు 369 బస్సుల్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చే బస్సుల్ని యడ్లపాడు గ్రామంలో నిలుపుదల చేసి అందులో ప్రయాణిస్తున్న ప్రజలకు ఆహారం, మంచి నీరు అందజేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అలాగే యడ్లపాడు మండలంలోని వివిధ గ్రామాల నుంచి తరలివెళ్లే వారికి మాత్రం ఆయా గ్రామాల్లోనే భోజన సౌకర్యాలను స్థానికంగా అందించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు, డీఆర్‌ఓ మురళి, మార్కెటింగ్ ఏడీ సూర్యప్రకాశ్‌రావు, యడ్లపాడు, నాదెండ్ల తహసీల్దార్లు, ఏవీ రమణ, యడ్లపాడు డీటీ అనురాధ, ఎంపీడీవో హేమలతాదేవి, స్వరూపారాణి, ఈవోపీఆర్‌డీ షేక్ జాకీర్‌హుస్సేన్, అర్బన్‌సీఐ టి రమేష్, యడ్లపాడు, రూరల్ ఎస్‌ఐలు టి.శివరామకృష్ణ, జి.అనిల్‌కుమార్, వీఆర్వో కేపీ చారి, టీడీపీ అధికారులు పాల్గొన్నారు.

## ఉన్నది 32 – హాజరైంది 10 మంది!

- తూతూ మంత్రంగా మున్సిపల్ అత్యవసర సమావేశం
- కమిషనర్ లేరని వెళ్లిపోయిన చైర్మన్!



చైర్మన్ డాక్టర్ దస్తగిరి

**వినుకొండ:** స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన అత్యవసర సమావేశం కౌన్సిల్ సభ్యులు లేక వెలవెలబోయింది. 32 వార్డు కౌన్సిలర్లు ఉండగా కేవలం పది మంది మాత్రమే హాజరైన మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ కూడా సమావేశం సమయం దాటినప్పటికీ హాజరుకాలేదు. అజెండాలో 39 అంశాలు పొందుపరచగా అజెండా రూపొందించినప్పుడు తమకు తెలియకుండా ఎలా రూపొందించారని చైర్మన్ డాక్టర్ దస్తగిరి సమావేశం మందిరం నుంచి సీరియస్‌గా బయటకు వెళ్లిపోయారు. దీంతో అధికారులు, కౌన్సిలర్లు ఖంగుతిన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ మున్సిపల్ శాఖ మంత్రి నారాయణతో సెట్ కాన్ఫరెన్స్‌లో ఉండటం వల్ల సమావేశానికి హాజరుకాలేకపోయానని, అందు కోసమే సమావేశానికి లేటుగా రావడం జరిగిందని వివరణ ఇచ్చారు. ఇటీవల కాలంలో వైఎస్సార్ సీపీ పార్టీ నుంచి టీడీపీలోకి వెళ్లిన చైర్మన్ డాక్టర్ దస్తగిరి ఇలా ప్రవర్తించడం పట్ల కొందరు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

## వద్దన్న కార్మికులకు తిరిగి విధుల్లోకి తీసుకోవాలి

**విద్యుత్‌శాఖ అధికారులకు సూచించిన ఏఐటీయూసీ నాయకులు**



మాట్లాడుతున్న బాలకాశి

**నరసరావుపేట:** వినుకొండలో 16 మంది, సత్తెనపల్లి నియోజకవర్గంలో 19 మంది కార్మికులను విద్యుత్‌శాఖ అధికారులు విధులకు రావొద్దని చెప్పటం అన్యాయమని, వెంటనే వారిని మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.బాలకాశి పేర్కొన్నారు. బుధవారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ ) పల్నాడు జిల్లా జనరల్ బాడీ సమావేశం స్థానిక అవ్వారి భావన్నారాయణ భవన్ (ఏఐటీయూసీ)లో నిర్వహించారు.

దీనికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న బాలకాశి మాట్లాడుతూ పేద కుటుంబాలైన కార్మికులను తిరిగి వారి ఉద్యోగాలు వారికి ఇవ్వాలని, లేని పక్షంలో కార్మికులు, ఇతర కార్మిక సంఘాలను ఐక్యంచేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ విద్యుత్ కార్మికులు చేయు పోరాటాలకు యూనియన్ మద్దతు తెలుపుతుందన్నారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసరావు, జాన్ కుమార్, నగర కార్యదర్శి సత్యనారాయణ రాజు, కార్మికులు పాల్గొన్నారు.

### సబ్ రిజిస్టర్‌గా టి.హేమలత

**వినుకొండ:** సబ్‌రిజిస్టర్‌గా టి.హేమలత బుధవారం బాధ్యతలు చేపట్టారు. గత కొంతకాలంగా ఖాళీగా ఉన్న ఈ పోస్టులో సీనియర్ అసిస్టెంట్ ఎస్కే అక్తరున్నిస ఇన్చార్జిగా వ్యవహరిస్తున్నారు. బాపట్ల జిల్లా ఇంకొల్లు నుంచి వినుకొండ బదిలీపై వచ్చారు రెగ్యులర్ పోస్టులో సబ్ రిజిస్టర్ బాధ్యతలు చేపట్టడంతో సమస్య పరిష్కారం అయ్యింది. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆమెకు స్వాగతం పలికారు.

### యువతి అదృశ్యంపై కేసు నమోదు

**యడ్లపాడు:** తమ కుమార్తె కనిపించడం లేదంటూ యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... ఈనెల 15వ తేదీన రాత్రి మండలంలోని మర్రిపాలెం గ్రామానికి చెందిన గూడూరి ఆదియ్య కుటుంబ సభ్యులంతా కలిసి భోజనం చేసి నిద్రకు ఉపక్రమించారు. మరుసటి రోజు ఉదయం నిద్రలేచి చూడగా ఆదియ్య పెద్దకుమార్తె స్రవంతి ఇంట్లో కనిపించలేదు. దీంతో బంధువులు, స్రవంతి స్నేహితులను కలిసి ఆచూకీ కోసం గాలించారు. తన 18 ఏళ్ల కుమార్తె ఆచూకీ ఎక్కడా లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. యువతి తండ్రి ఆదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ టి. శివరామకృష్ణ తెలిపారు.

### మహిళపై దాడి చేసిన ఇరువురిపై కేసు

**యడ్లపాడు:** మహిళపై దాడి చేసిన ఇరువురిపై యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యడ్లపాడు మండలం ఉప్పరపాలెం గ్రామానికి చెందిన డేరంగుల మల్లేశ్వరి అనే మహిళ ఈనెల 23వ తేదీన తన ఇంటి బయట డ్రమ్ములో నీటిని నిల్వ చేసుకుంది. అయితే ఆమె బంధువులైన పల్లపు కోటేశ్వరరావు, సుజాత దంపతులు ఆమె అనుమతి లేకుండా అందులోని నీటిని వినియోగించుకున్నారు. ఇదేమని ప్రశ్నించిన మల్లేశ్వరిని అసభ్య పదజాలంతో దూషించి, దాడి చేసి గాయపరిచారు. ఈ సంఘటనకు సంబంధించి బాధితురాలు మల్లేశ్వరి నుంచి ఫిర్యాదు తీసుకున్న ఎస్ఐ టి శివరామకృష్ణ దాడి చేసిన దంపతులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### కాలువకు మరమ్మతులు చేయాలి

**వినుకొండ:** బ్రాహ్మణపల్లి – విఠంరాజుపల్లి మధ్యలో ఉన్న మైనర్ ఇరిగేషన్ కాలువ రిపేరు పనులు వెంటనే మొదలుపెట్టేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు పీడీఎం నాయకులు, రైతులు వినతిపత్రం అందజేశారు. వినుకొండ మండలం బ్రాహ్మణపల్లి రోడ్డు నుంచి నరసరావుపేట రోడ్డు (తారురోడ్డు) వరకు ఒక కిలోమీటర్‌కు పైగా కాలువ రెండువైపులా కంప చెట్లు పెరిగి, రహదారి లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు, దీనిపై అధికారులకి అర్జీలు పెట్టిన తరువాత ఇటీవల రెండు వైపుల సర్వే చేసి హద్దులు నిర్ణయించడం జరిగింది, అధికారులు నాలుగున్నర లక్షలు అంచనా వేసి పై అధికారులకు పంపామని తెలియజేశారు. సుదీర్ఘకాలం నుంచి కాలవ మరమ్మతులకు నోచుకోకపోవడం వలన రైతులు ఇబ్బంది పడుతున్నారని తగిన చర్యలు తీసుకుంటామని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వై. వెంకటేశ్వరరావు, రైతులు పగడాల చినకోటిరెడ్డి, కంత రంగారావు, యాదల శంకర్‌రావు, నిసంకి వెంకటేశ్వర్లు, గాయం చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అక్షయపాత్ర ఫౌండేషన్‌కు రూ.లక్ష విరాళం



విరాళాన్ని ఎంపీ లావుకు అందజేస్తున్న శాంతి శ్రీనివాసరెడ్డి

**నరసరావుపేట రూరల్:** అక్షయపాత్ర ఫౌండేషన్‌కు ఏఎంరెడ్డి విద్యాసంస్థల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి రూ.లక్ష విరాళంగా అందేజేశారు. విరాళాన్ని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ద్వారా అక్షయపాత్ర ఫౌండేషన్‌కు అందించారు. ఈ సందర్భంగా శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్‌జీవో సంస్థగా అక్షయపాత్ర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. పిల్లలకు పోషకాహారం, విద్యను అందించేందుకు ఈ ఫౌండేషన్ కృషిచేస్తుందన్నారు. లక్షలాది మంది పిల్లలు పౌష్టికాహారం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇటువంటి వారికి సహాయాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా ముందుకు రావాలని కోరారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్.మల్లికార్జున, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భార్గవ్ భూషణ్, డిప్లొమా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి రైఫిల్ శిక్షణకు క్యాడెట్స్ ఎంపిక




శిక్షణకు ఎంపికైన క్యాడెట్స్‌ను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు

**నరసరావుపేట రూరల్:** రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ శిక్షణకు నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్స్ ఎంపికైనట్లు కళాశాల ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ మేడికొండ రాకేష్ బుధవారం తెలిపారు. ఈనెల 25, 26తేదీలలో చీరాల ,గుంటూరులో నిర్వహించిన ఎంపికలో క్యాడెట్స్ పి.గీత సాయిశ్రీవల్లి, పి.లిఖిత నందిని, బీపీఎస్ వినయ్‌కుమార్, బి.కిషోర్‌భూపాల్, ఎ.యోగేష్‌లు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి శిక్షణకు ఎంపికైనట్లు వివరించారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలో మే 13 నుంచి 25వ తేదీ వరకు శిక్షణలో వీరు పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు, వైస్‌చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌బాబు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీల్, అధ్యాపకులు అభినందించారు.

## బాలుడి పొట్ట నుంచి నాణేలు తొలగింపు



నాణేలు తొలగించిన బాలుడు, అతని తల్లితండ్రులతో డాక్టర్ శ్రీనివాస్

**నరసరావుపేట:** రెండు ఐదు రూపాయల నాణేలు మింగిన ఎనిమిదేళ్ల బాలుడి పొట్ట నుంచి పట్టణానికి చెందిన శకుంతల జనరల్ అండ్ గ్యాస్ట్రో లివర్ కేర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఐలా శ్రీనివాస్ సురక్షితంగా బయటకు తీసి ఆ బాలుడి ప్రాణాలు కాపాడారు. సంతమాగులూరుకు చెందిన ఎనిమిదేళ్ల తగర్లమూడి జోగేంద్ర నాణేలు మింగిన విషయం గమనించిన తల్లితండ్రులు బాలకృష్ణ, సుజాత పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లో గల శకుంతల హాస్పిటల్‌ను ఆశ్రయించారు. డాక్టర్ శ్రీనివాస్ ఆ బాలుడిని పరీక్షించి ఎటువంటి ఆపరేషన్ చేయకుండానే ఎండోస్కోపీ ద్వారా ఆ వాటిని చాకచక్యంగా సురక్షితంగా బయటకు తీశారు. దీనిపై డాక్టర్‌ను బాలుడి తల్లి తండ్రులు అభినందించారు. డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో అత్యాధునిక వైద్య పరికరాలతో ఇటువంటి క్లిష్టమైన చికిత్సలు తక్కువ ఖర్చుతో చేయటం జరుగుతుందని వివరించారు.

## కత్తితో బెదిరించి నగదు వసూలు

- బాధితుడి ఫిర్యాదుతో టూటౌన్‌లో కేసు నమోదు
- నిందితుడి అరెస్టు

**నరసరావుపేటటౌన్:** మద్యం సేవించడానికి డబ్బులు ఇవ్వమని కత్తితో బెదిరించి రూ.1500 రూపాయలు నగదును తీసుకున్న కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు టూటౌన్ ఎస్ఐ లేఖ ప్రియాంక బుధవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. క్రిస్టియన్ పాలెంకు చెందిన దామవరపు నాగేశ్వరరావు ఈనెల 28వ తేదీ రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులతో నిద్రిస్తుండగా అర్ధరాత్రి సుమారు రెండు గంటల ప్రాంతంలో తమ వీధిలో కొందరు యువకులు పెద్దపెద్దగా కేకలు వేస్తూ ఉండటంతో బయటకు వచ్చాడు. ఆ సమయంలో మల్లెల భాను ప్రకాష్ అలియాస్ బాల మరి కొంత మంది కలిసి కేకలు వేస్తున్నారు. అంతట వారిని మందలించి అక్కడి నుంచి పంపాడు. ఈ సంఘటన దృష్టిలో ఉంచుకొని ఈనెల 29వ తేదీ ఉదయం 6 గంటల సమయంలో తన ఇంటి వద్దకు భాను ప్రకాష్ పొడవైన కత్తి తీసుకొని వచ్చి తన మెడపై పెట్టి తనకు తాగడానికి డబ్బులు ఇవ్వాలని లేకపోతే చంపేస్తానని బెదిరించాడని నాగేశ్వరరావు ఫిర్యాదు చేశాడు. భయపడి తన వద్ద ఉన్న రూ.1500 రూపాయలను ఇచ్చానన్నాడు. ఈ విషయం ఎవరికైనా చెప్తే చంపేస్తానని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి ఆయుధం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

## జాబ్‌కార్డు ఉన్నవారందరికీ ఉపాధి పనులు కల్పించాలి

**ఎంపీడీవో సీతారామయ్య**



మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామయ్య

**శావల్యాపురం:** జాబ్‌కార్డు ఉన్న వారందరికీ ఉపాధి పనులు తప్పనిసరిగా కల్పించాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిసెంట్స్‌కు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో సీతారామయ్య మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీలు ఉండగా ప్రతిరోజు 2300 మంది పంట కాల్వలు, పశువుల తొట్లు, ఇంకుడుగుంతలు, పంట కుంటలు తదితర పనులను చేస్తున్నట్లు తెలిపారు.వేసవికాలం కావటం చేత ఉష్ణోగ్రత తీవ్రత ఆధారంగా ఉదయం–సాయంత్రం సమయాల్లో పనులు చేసేలా ఫీల్డ్ అసిస్టెంట్స్ బాధ్యత వహించాలన్నారు. ప్రతి కుటుంబానికి వంద రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. రూ.307 రూపాయలు ప్రభుత్వం వేతనం ప్రకటించగా కొలతలు ప్రకారం పనులు చేసిన కూలీలకు పూర్తిస్థాయిలో వేతనం వస్తుందన్నారు. కూలీలకు వేతనాలు పెండింగ్‌లో లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఆయనతో పాటు ఏపీవో కె.రామారావు, ఏపీయం జి.వాసుబాబు ఉన్నారు.

### డివైడర్ ఎక్కించిన 'నిద్రమత్తు'!



**యడ్లపాడు:** డ్రైవర్ నిద్రమత్తు కారణంగా వేగంగా ప్రయాణిస్తున్న లారీ హైవే డివైడర్‌పైకి ఎక్కడంతో పెనుప్రమాదం తప్పింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కడప నుంచి కోల్‌కత్తాకు వెళ్తున్న బత్తాయిలోడు లారీ, యడ్లపాడు సమీపంలోకి రాగానే డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకున్నాడు. దీంతో అదుపు తప్పి లారీ నేరుగా డివైడర్ మీదికి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన ఈ ఘటనలో హైవే సెంట్రల్ డివైడర్‌పై ఏర్పాటు చేసిన ఇనుపకంచెతో పాటు లారీ ముందు భాగం తీవ్రంగా ధ్వంసమైంది. అయితే అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడం స్థానిక ప్రజలు పెనుప్రమాదం తప్పిందంటూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వాహనాన్ని తొలగింపు చర్యలు చేపట్టి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. ప్రయాణాల్లో నిద్రమత్తు ప్రమాదాలకు కారణమవుతుందని, డ్రైవింగ్ చేస్తున్నవారు తరచూ విశ్రాంతి తీసుకోవాలని, అలసటలో వాహనం నడపొద్దని ఎస్ఐ టి.శివరామకృష్ణ ప్రజలకు సూచించారు.

## వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

**ఫిరంగిపురం:** మండలంలోని రేపూడి, అమీనాబాద్ గ్రామాల్లో బుధవారం ప్రజలకు సన్‌స్ట్రోక్ (వడదెబ్బ) తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. పాల్గొన్న అధికారులు మాట్లాడుతూ.. తీవ్రంగా ఎండలు ఉన్న సమయంలో ఎక్కువగా తిరగవద్దని చెప్పారు. మాంసాహారం తగ్గించి కూరగాయలను ఆహారంలో తీసుకోవాలన్నారు. నీరు, పళ్ల రసాలు, కొబ్బరినీళ్లు, మజ్జిగ, ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. లేత రంగులో ఉండే పలుచని దుస్తులు ధరించాలన్నారు. రోజూ కనీసం 15 గ్లాసుల మంచినీరు తాగాలని చెప్పారు. ఒక వేళ వడదెబ్బ తగిలిన పక్షంలో ఆ వ్యక్తిని నీడ ఉండే ప్రదేశానికి తీసుకొచ్చి, తడిగుడ్డతో శరీరం తుడవాలని చెప్పారు. చల్లనిగాలి తగిలేలా చూసి ఉప్పు కలిపిన మజ్జిగ, లేదా చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజు నీరు, ఓఆర్ఎస్ ద్రావణం తాగించాలని సూచించారు. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు ఎండలో ఎక్కువగా తిరగవొద్దని చెప్పారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఎంఎల్ హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేపు ఆదిశంకరుల జయంతి వేడుకలు

**తాడేపల్లి రూరల్:** పట్టణంలోని నులకపేటలో చైతన్య తపోవనంలో శుక్రవారం ఆది శంకరాచార్యుల జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నట్లు మాతా శివానంద సరస్వతి తెలిపారు. బుధవారం తపోవనంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆది శంకరాచార్యుల జయంతి సందర్భంగా శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం చిన్నారులతో నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు.